ఉష్ణోగ్రత (అంచనా) 20-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	36	27
తెనాలి	36	28
నరసరావుపేట	35	25
బాపట్ల	35	28
రెంటచింతల	38	26
చీరాల	34	26



1,2.. అంటే పెద్ద పరీక్షే!

- ఇదీ గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భూసార పరీక్షల తీరు..
- ఒక్క ల్యాబ్ ఉన్నా..పల్నాడు జిల్లానే కొద్దిగా మెరుగు
- వేలల్లో మట్టి నమూనాల సేకరణ లక్ష్యం..
- క్షేత్రస్థాయిలో జరుగుతున్నది ఒకటి .. రెండే
- ల్యాబ్‌లలో సిబ్బంది, రసాయనాల కొరత..
- ప్రభుత్వ సూక్ష్మ పోషకాలు కోల్పోవాల్సిందేనా..?


మట్టి నమూనాల పరీక్షలు

1, 2.. ఇవి పోటీ పరీక్షల్లో విద్యార్థుల ర్యాంకుల కాదు.. వ్యవసాయాధారిత జిల్లాల్లో వ్యవసాయ శాఖ నిర్వహించిన మట్టి నమూనా పరీక్షలు.. మట్టి నమూనాల పరీక్షలు లక్ష్యం ఘనంగా ఉన్నా.. ఆచరణ శూన్యంగా ఉంది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 60,124 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా.. ఇప్పటికి 452 నమూ నాల పరీక్షలు మాత్రమే పూర్తయినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. జిల్లాల వారీగా ఆచరణ సాధ్యం కాని స్థాయిలో మట్టి పరీక్షల టార్గెట్‌లు ఇచ్చిన ప్రభుత్వం.. కేత్రస్థాయిలో వసతులు కల్పించ డాన్ని విస్మరించింది. పరీక్షల ల్యాబ్‌లలో రసాయనాలు, పరికరాలు, సిబ్బంది కొరత వెంటాడుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

భూసార పరీక్షలు యజ్ఞంలా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆచరణలో వ్యవసాయ శాఖ చతికిల పడింది. మట్టి నమూనాలను టార్గెట్‌ల మేర సేకరిస్తున్నారే తప్పా..ఆ మేరకు పరీక్షలు జరగడం లేదు. రైతులకు పుడమి ఆరోగ్య కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించినా ఆచరణలో సాధ్యమయ్యే పరిస్థితులు లేవు. వర్షాలు ఈ సారి ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో అన్నదాతలు సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే పంట సాగు నాటికి భూసార పరీక్షలు పూర్తి కావు. పంటల సాగులో భూసార పరీక్షలు కీలకం.

భూసార పరీక్షలతో లాభాలు..

భూమిలో సారం ఎంత ఉందో పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. సాగు నేలలో సూక్ష్మపోషకాలు ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. పరీక్షల ఆధారంగా భూమి సారాన్ని నిర్ధారించి ఏ పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చో అన్నదాతలకు తెలియజేస్తారు. భూసారం బాగుంటేనే పంటల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. నేలలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచికతో పాటు, మట్టి పరీక్షల ద్వారా ఆమ్ల, క్షార లవణాలస్థాయి(పీహెచ్)తో పాటు పాస్పరస్, పోటాషియం, ఆర్గానిక్ కార్బన్, సల్ఫర్, జింక్, ఐరన్, కాపర్, బోరాన్, మెగ్నీషియం నేలలో ఏ మోతాదులో ఉన్నాయో పరీక్షల ద్వారా గుర్తిస్తారు. పొలంలో పంటలు బాగా పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో సరైన పోషకాలు ఉన్నాయా.. లోపాలు ఉన్నాయా అనేది పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఈ మేరకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు సూచిస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన భూసార పరీక్షలు అటకెక్కాయి. మట్టి నమూనాల పరీక్షలు వేగవంతం చేసి వచ్చే జూన్ కన్నా హెల్త్ కార్డులు అందజేయాలని రైతులు కోరుతున్నారు.


ల్యాబ్‌లో మట్టి పరీక్షలు పరికరాలు

గుంటూరు జిల్లాలో ఒకటి..

గుంటూరు జిల్లాలో మట్టి నమూ నాల పరీక్షల కోసం మూడు ల్యాబ్‌లు ఉన్నా యి. 13,882 మట్టి నమునాలను పరీక్షించాలనేది లక్ష్యం కాగా ఇప్పటికి 10,269 నమూనాలను సేకరిం చారు. టార్గెట్‌లో 74.07 శాతం మాత్రమే సేకరణ పూర్తయింది. సేకరించిన నమూనాల్లో ఒకటే నమూనాను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డు సిద్ధం చేశారు. ఈ జిల్లాలో నమూనాల పరీక్షల్లో అంతులేని నిర్లక్ష్యం నెలకొంది. ఈ జిల్లాలో మట్టి నమూనాల పరీక్షలు ఇలా కొనసాగితే ఏడాదికి పూర్తయినా.. పూర్తయి నట్లేనని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సూక్ష్మపోషకాలు కోల్పోయే పరిస్థితి..

జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం వంటి సూక్ష్మ పోషకాలు.. వచ్చే సీజన్‌లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భూసార పరీక్షల ద్వారా సూక్ష్మ పోషకాల లోపాలను నిర్ధారించనున్నారు. ఈ మేరకు సూక్ష్మ పోషకాలను రాయి తీపై అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మట్టి నమూనాల పరీక్షలు ఇలానే సాగితే ప్రభుత్వం అందజేయనున్న సూక్ష్మ పోషకాలను రైతులు కోల్పోయే ప్రమాదం ఉంది.

పల్నాడులో రోజుకు 100 నమూనాల పరీక్ష..

పల్నాడు జిల్లాలో రోజుకు వంద నుంచి 150 లోపే మట్టి నమూనాల పరీక్షలు జరుగుతున్నాయి. 28 మండలాలకు ఉన్నది ఒక్క ల్యాబే. దీనిలో కూడా సిబ్బంది కొరత నెలకొంది. చిలకలూరిపేటలోని ల్యాబ్‌ను సిబ్బంది, పరికరాల కొరతతో మూసివేశారు. దీంతో జిల్లాలో సేకరించిన మట్టి నమూనాలను నరసరావుపేట ల్యాబ్ లో మాత్రమే చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ల్యాబ్‌లో వసతులు లేక మహిళా సిబ్బంది తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అయితే జిల్లాలో 23,437 మట్టి నమూనాల పరీక్షల చేయాలని లక్ష్యంగా నిర్ణ యించారు. 18,953 మట్టి నమూనాలను సేకరించారు. 80.87 శాతం మట్టి నమూనాల సేకరణ పూర్తి చేశారు. ఇందులో 452 మట్టి నమూనాలను పరీక్షించి సాయిల్ హెల్త్ కార్డులను సిద్ధం చేశారు. నిర్దేశించిన లక్ష్యంలో 2.38 శాతం మాత్రమే మట్టి నమూనాల పరీక్షలు పూర్తయ్యాయి. రోజుకు వంద చొప్పున నమూనాల పరీక్షలు చేస్తే ఖరీఫ్ సీజన్ ముగిసే లోపు కూడా భూసార పరీక్షల కార్డులు రైతులకు అందే పరిస్థితి ఉండదు. పల్నాడు జిల్లాలో సేకరించిన మట్టి నమూనాల్లో 50 శాతం గుంటూరు.. బాపట్ల పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు అనుమతి కోరుతూ లేఖ రాసినట్లు జేడీ మురళీ తెలిపారు. గుంటూరు, బాపట్ల జిల్లాతో పోలిస్తే పల్నాడు జిల్లాలో పరీక్షలు కొంత మెరుగ్గా ఉంది.


నరసరావుపేటలోని భూసార పరీక్షల ల్యాబ్

బాపట్ల జిల్లాలో రెండు..

బాపట్ల జిల్లాలో మట్టి నమూనాల పరీక్షలకు మూడు ల్యాబ్‌లు ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అయితే ల్యాబ్‌లు ఉన్నా నమూనాల పరీక్షల్లో తీవ్ర నిర్లక్ష్యం తాండవిస్తోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ జిల్లాలో 22,825 మట్టి నమూనాల పరీక్షల లక్ష్యం కాగా ఇప్పటికి 14,798 మట్టి నమూనాలను సేకరించారు. 64.83 శాతం మట్టి నమూనాలను సేకరించగా వీటిలో రెండు నమూనాల పరీక్షలు పూర్తి చేసి సాయిల్ హెల్త్ కార్డులు సిద్ధం చేశారు. సిబ్బంది, రసాయనాల కొరత వల్లే మట్టి పరీక్షలు జరగడం లేదన్న వాదనను సదరు అధికారులు వినిపిస్తున్నారు.



ఉప ఎంపీపీలు గాడిపర్తి రమాదేవి,వంపుగుడి సువార్తమ్మ

ఉప పోరులో టీడీపీ జోరు

వైస్ ఎంపీపీలుగా పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం

కారంపూడి, నరసరావుపేట రూరల్ మే 19 (ఆంధ్రజ్యోతి): కారంపూడి, నరసరావుపేట ఉప ఎంపీపీ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. కారంపూడి ఉప ఎంపీపీగా గాడిపర్తి రమాదేవి ఏకగ్రీవం కాగా నరసరావుపేట వైస్ ఎంపీపీగా వంపుగుడి సువార్తమ్మ ఎన్నికయ్యారు. ఆయా మండలాల ఉప ఎంపీపీలు కోకా అక్కమ్మ, శ్రీలక్ష్మీ మృతితో ఎన్నిక అనివార్యమైంది. కారంపూడిలో 14 మంది ఎంపీటీసీలకు ఆరుగురు హాజరయ్యారు. గాదెవారిపల్లె ఎంపీటీసీని కూనిరెడ్డి సైదారెడ్డి బలపరచగా ఒప్పిచర్లకు చెందిన ఇద్దరు ఎంపీటీసీలు ఆమోదించారు. మిగతా ఎంపీటీసీలు మద్దతు తెలపడంతో రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జేసీ, ఎన్నికల అబ్జర్వర్ సూరజ్ గనోరే, ఎన్నికల అధికారి ఎస్.లింగమూర్తి అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. నరసరావుపేటలో పమిడిపాడు -1, ఉప్పలపాడు ఎంపీటీసీ సభ్యులు కంచేటి భార్గవి, కందుల నాగమ్మ బలపర్చడంతో వంపుగుడి సువార్తమ్మను వైస్ ఎంపీపీగా ఎన్నికల అధికారి మురళి ప్రకటించారు. సువార్తమ్మకు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

పాడి రైతుకు బీమా రక్ష

సేద్యం నష్టాలను మిగిల్చిన ప్రతిసారీ ఎంతోకొంత పాడి పరిశ్రమే అన్నదాతలను ఆదుకుంటూ వస్తోంది. అంతటి కీలకమైన రంగాన్ని గత ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసి.. పాడి రైతుల ప్రయోజనాలకు గండి కొట్టింది. పశువులకు బీమా విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించింది. అటు రైతులూ సొంతంగా బీమా చేసుకోకుండా చేసి.. వారిని నిలువునా వంచించింది. అరకొరగా చేసిన బీమాకు సొమ్ము అందించడానికి ఏళ్ల తరబడి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పింది.. ఈ బాలారిష్టాలను తొలగించి పాడి పరిశ్రమను తిరిగి గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది.



- రైతులు కట్టే ప్రీమియం వాటా తగ్గింపు
- తొలి విడతలో మూడు జిల్లాలకు రూ.88 లక్షలు విడుదల
- దశల వారీగా నిధుల విడుదలకు కసరత్తు
- రైతులకు పశుసంవర్ధక శాఖ అవగాహన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పశు బీమాపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వంలో బీమా ప్రీమియం వాటా రైతులు చెల్లించాల్సింది 20 శాతం ఉండేది. ఇప్పుడు దానిని 15 శాతానికి తగ్గించి, రైతులకు మరింత మేలు చేసేలా మార్గదర్శకాలు జారీ చేయడంతో పాటు.. తొలి విడతలో భాగంగా మూడు జిల్లాలకు ప్రీమియం వాటా తాలూకా నిధులను ప్రభుత్వం విడుదల చేయడంతో పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు వాటా 5 శాతం తగ్గింపు..

పశువులకు చెల్లించే బీమా ప్రీమియం సొమ్ములో గతంలో రైతు వాటా 20 శాతంగా ఉండేది. ఇప్పుడు దానిని 15 శాతానికి తగ్గించగా.. మిగిలిన 85 శాతంలో కేంద్రం 60, రాష్ట్రం 40 శాతం భరించే విధంగా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ప్రీమియం వాటాకు సంబంధించి తొలి విడత నిధుల విడుదలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. దీనిలో భాగంగా బాపట్ల జిల్లాకు రూ.32 లక్షలు విడుదల కాగా.. 63 శాతం పశుసంవర్ధకశాఖ ఖర్చు చేసింది. పల్నాడు జిల్లాలో రూ.30 లక్షలు, గుంటూరు జిల్లాలో రూ.26 లక్షలు తొలి విడతలో భాగంగా బీమా ప్రీమియం నిధులు విడుదల కాగా.. 70 శాతం ఈ రెండు జిల్లాల పరిధిలో ఇప్పటికే ఖర్చు చేశారు. పశువుకు బీమా రూ.30 వేలుగా ఉంటే.. ప్రీమియం సొమ్ము రూ.1,920గా ఉంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా రూ.1,632 ఉంటే.. రైతు వాటాను రూ.283కే ప్రభుత్వం పరిమితం చేసింది. పశువులకు బీమా రూ.50 వేలు వరకు, గొర్రెలు, మేకలకు రూ.6 వేలు వరకు కల్పించేలా ఆదేశాలు జారీ చేసింది. గతంలో బీమా సౌకర్యం ఐదు పశువులకు మాత్రమే గరిష్ఠంగా ప్రభుత్వం కల్పించేది. దానిని ఇప్పుడు పది వరకు పెంచింది. గొర్రెలు, మేకలకు (మిగతా 6వ పేజీలో)


ప్రసంగిస్తున్న మంత్రి గొట్టిపాటి, వేదికపై ఎంపీ లావు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

టీడీపీ పాలన స్వర్ణయుగం

- మంత్రి గొట్టిపాటి
- మాచర్లలో దిగ్విజయంగా మహానాడు

మాచర్లటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలన స్వర్ణయుగమని విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో సోమవారం నియోజకవర్గ మహానాడు కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. మహానాడుకు హాజరైన మంత్రి రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ స్థాపించిన 9 నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి దేశ రాజకీయాల్లో సంచలనాలు సృష్టించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావుకే చెందుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు బాటలు వేస్తున్నారని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని టీడీపీ కీర్తిని చంద్రబాబు ప్రపంచ నలుదిశలా వ్యాప్తి చేస్తున్నారన్నారు. యువ నేత నారా లోకేశ్ తండ్రి బాటలో నడుస్తూ కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడుతున్నారని పేర్కొన్నారు.

ప్రగతి, పథకాలు ఆగవు: ఎంపీ లావు

ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ప్రగతి, పథకాలు ఆగవని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్పష్టం చేశారు. లక్ష్యాల నిర్దేశానికే మహానాడు కార్యక్రమం అని, సాగునీరు, మౌలిక రంగ ప్రాజెక్ట్‌లపై సీఎం దృష్టి సారిస్తున్నారని చెప్పారు. ఎన్నికల ముందు నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి.. బ్రహ్మానందరెడ్డిని గెలిపించుకునేందుకు పార్టీ కేడర్ పోలింగ్ బూత్‌లలో యుద్ధం చేసిందని గుర్తుచేశారు. వారందరికీ సుముచిత ప్రాధాన్యం ఉంటుందన్నారు.

ప్రగతికి పది తీర్మానాలు: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల నియోజకవర్గ ప్రగతికి మహానాడు వేదిక పది తీర్మానాలు చేశామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. ప్రతి ఇంటికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగు నీరు అందించే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు. కడపలో నిర్వహించే మహానాడుకు నియోజకవర్గం నుంచి తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీ నేతలు గజమాలలతో మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు, మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి, యువనేత జూలకంటి అక్కిరెడ్డి, అంజయ్య, కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, పెద వెంకటరామిరెడ్డి, పోలూరి నరసింహారావు, యాగంటి మల్లికార్జునరావు, సాతులూరి కుమార్, నేరేటి వీరాస్వామి యాదవ్, మధుయాదవ్, కొమెర అనంతరాములు, నాయక్ పాల్గొన్నారు.


గజమాలతో నాయకులకు స్వాగతం

ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం

- గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తాం
- ప్రజలకు సేవ చేసే పార్టీ టీడీపీ
- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా లోకేశ్ కృషి

వినుకొండటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ తిమ్మాయపాలెం రోడ్డులోని వై కన్వెన్షన్ హాల్‌లో ఆయన ఆధ్వర్యంలో మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా సభాప్రాంగణంపై ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి జీవీ, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, పేదవారి ఆకలి తీర్చడంతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయడం టీడీపీకే సాధ్యమని తెలిపారు. కార్యకర్తల కోసం లోకేశ్ అండగా ఉన్నారని తెలిపారు. ఈ నెల 28న ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహానాడు సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలపడంతో సభావేదిక మొత్తం హర్షధ్వానాలు రేకెత్తించాయి. పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయమే టీడీపీ ప్రధాన లక్ష్యమన్నారు. అట్టడుగు వెనుకబడిన వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ మరింత మెరుగ్గా పనిచేసి ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. గతంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేసి తీరుతామని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటామని, అందరూ బాగుండాలి వారిలో మేము బాగుండాలన్నదే నా అభిమతమని తెలిపారు. ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పేదవారికి కూడు, గూడు కల్పిం చడమే పార్టీ అజెండా అని తెలిపారు. రానున్న రోజుల్లో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంగా లోకేశ్ పనిచేస్తున్నారని, ఇప్పటికే కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తరువాత లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించా రన్నారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 4వేల టిడ్కో ఇళ్లను మంజూరు చేస్తే కేవలం 14 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయని, త్వరలో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మానుకొండ శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి షమీమ్, జడ్పీటీసీ రామ య్య, వినుకొండ మున్సిపల్ చైర్మన్ సతీమణి షకీలా, ఎంపీటీసీ లు, సర్పంచ్‌లు, క్లస్టర్ కన్వీనర్లు, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహా నాడు కార్యక్రమంలో భాగంగా టీడీపీ సీనియర్ నాయకుడు పెమ్మసాని సాగేశ్వరరావు రానున్న రోజుల్లో వినుకొండ పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సభలో ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ వేదికపై ఎంపీ లావు, మక్కెన, కొమ్మాలపాటి తదితరులు

కార్యకర్తల కష్టంతోనే.. విజయం

మినీ మహానాడులో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : అందరి కష్టంతోనే నరసరావుపేటలో టీడీపీ విజయం సాధించిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు జరిగింది. కార్యక్రమంలో ఎన్టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. సభకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దుర్మార్గుడని, ఆ రోజులలో నామినేషన్ ఎవరిని వేయనీయకుండా అధికార బలంతో దాడులు చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, సుబ్బరాయగుప్తా, మన్నవ మోహన్‌కృష్ణ

పాడి రైతుకు 'బీమా' రక్ష

(5వ పేజీ తరువాయి)

వంద వరకు వెసులుబాటు కల్పించింది. ఒక్కసారి బీమా చెల్లిస్తే మూడేళ్ల పాటు అది అమల్లో ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ఉత్తర్వులన్నీ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రాగా.. ఈ నెల మొదటి వారం నుంచి బీమా ప్రక్రియను యంత్రాంగం ముమ్మరం చేసింది.

ఎక్కువ శాతం బీమా గొడుకు కిందకు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న పశు సంపదలో దాదాపు 30 శాతం వరకైనా బీమా గొడుకు కిందకు తెచ్చేలా గ్రామాల్లో అవగాహన కల్పించే చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం బాపట్ల జిల్లాలో ఆవులు, ఎద్దుల సంఖ్య 21,930గా ఉండగా, గేదెలు 3,81,764 ఉన్నాయి. గొర్రెలు 4,27,523, మేకలు 49,990, పందులు 3,219 కాగా కోళ్లు 7,76,022 ఉన్నాయి. పల్నాడు జిల్లాలో ఆవుల సంఖ్య 68,000, గేదెలు 4,69,048, గొర్రెలు 4,80,000, మేకలు 1,58,000, పందులు 1,800 నమోదై ఉన్నాయి. గుంటూరు జిల్లాలో గేదెల సంఖ్య 2,20,000 వరకు ఉండగా.. మేకలు, గొర్రెలు కలిపి మూడు లక్షల వరకు ఉన్నాయి. వీటన్నింటికీ బీమా కల్పించేలా పాడి రైతులకు అవగాహన కల్పించడానికి పశు సంవర్ధకశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులను చైతన్య పరుస్తున్నారు

బకాయిలు చెల్లించి, పాడికి ఊతం

వైసీపీ ఏలుబడిలో అరకొరగా అమలు చేసిన పాడి సంబంధిత పథకాల బకాయిలను ఈ ప్రభుత్వం చెల్లించింది. బాపట్ల జిల్లాలో రూ.2కోట్ల వరకు పెండింగ్ మొత్తాలను చెల్లించగా గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో దాదాపు రూ.5 కోట్ల వరకు చెల్లించింది.బీమాను ఏడాది పొడవునా ఉధృతంగా అమలు చేసేలా పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గడచిన మూడు నెలల వ్యవధిలో దాదాపు 3శాతం పశు సంపద వృద్ధి.. మూడు జిల్లాల్లో నమోదు కావడం గమనార్హం.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 512.70 అడుగులు ఉంది. ఇది 136.30 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

డిమాండ్ లేకున్నా.. తత్కాల్ కోటానా..!

● ఈ కారణంగా జనరల్, రిమోట్ లొకేషన్, తత్కాల్‌లో కోత ● రైల్వే నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని ప్రయాణికుల సూచన

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా తిరుపతి, విశాఖపట్టణం, రాయగడ తదితర ప్రాంతాలకు ప్రయాణిస్తున్న అంతగా డిమాండ్ లేని రైళ్లలో రైల్వే శాఖ తాజాగా ప్రీమియం తత్కాల్ కోటాని జత చేసింది. దీని వలన ఇతర కోటాల్లో కోత పడింది. ఈ నిర్ణయం ఒక విధంగా మేలు చేసేలా ఉన్నా మరో రూపంలో నష్టం కలిగిస్తుంది. తత్కాల్/ప్రీమియం తత్కాల్ కోటాకు టిక్కెట్ల సంఖ్యని పెంచడం వలన జనరల్, రిమోట్ లొకేషన్ కోటాల్లో వాటి సంఖ్య తగ్గించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనివలన ప్రయాణికులకు ఎలాంటి ఉపయోగం జరగదు. కాగా ప్రీమియం తత్కాల్‌లో మిగిలిపోయిన టిక్కెట్లను తత్కాల్ వెయిటింగ్ లిస్టుని క్లియర్ చేయడానికి సర్దుబాటు చేస్తారు. జనరల్ కోటాలకు కూడా సర్దుతారు. ఈ కారణంగా జన రల్/తత్కాల్‌లో వెయిటింగ్ లిస్టులో బుకింగ్ చేసుకొన్న ప్రయాణికులు చార్ట్ సిద్ధమయ్యే సమయం కోసం ఎదురు చూస్తూ గడపాలి.

నంబరు. 20702 తిరుపతి - సికింద్రాబాద్ వందేభా రత్ ఎక్స్‌ప్రెస్‌కి గతంలో జనరల్ కోటాలో ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్(ఈసీ) సీట్లు 44 ఉండేవి. ఇవి తాజాగా సవ రించి 28కి తగ్గించారు. గుంటూరు రిమోటల్ లొకేషన్ లో గతంలో ఎనిమిది ఉండేవి కాస్త ఇప్పుడు రెండు పెరిగి పది అయ్యాయి. తత్కాల్ మాత్రం గతంలో 16 ఉంటే దానిని ఇప్పుడు 21కి పెంచారు. ఏసీ ఛైర్‌కార్ సీట్లు గతంలో 603 జనరల్ కోటాలో ఉంటే ఇప్పుడు 474కి తగ్గించారు. గుంటూరు



రిమోట్ లొకేషన్‌లో 120 నుంచి 100కి, తత్కాల్‌ని 158 నుంచి 209కి పెంచారు. రైల్వే శాఖ తీసుకొన్న ఈ నిర్ణయం వలన జనరల్ కోటాకు కోత పడి తత్కాల్‌కి పెరిగింది. ఇదేవిధంగా నంబరు. 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ త్రీటైర్ జనరల్ కోటాని ఏడు నుంచి 15కి పెంచారు. తత్కాల్‌ని కూడా ఎనిమిది నుంచి 20కి పెంపుదల చేశారు. స్లీపర్ క్లాస్‌కు గతంలో ఉన్న 159ని 259కి పెంచారు. తత్కాల్‌ని అయితే ఏకంగా వంద పెంచి 95 నుంచి 195 బెర్తులు చేశారు.

నంబరు. 22875 విశాఖపట్టణం - గుంటూరు ఉద య్ ఎక్స్‌ప్రెస్‌కు జనరల్ కోటా సీట్లే 100 శాతం బుకింగ్ జరగవు. అలాంటిది ఇప్పుడు కొత్తగా ప్రీమియం తత్కాల్ కోటాని చేర్చారు. ఈ రైలుకు తత్కాల్‌కు గతంలో 100 సీట్లు ఉండేవి వాటిని ఇప్పుడు 70కి తగ్గించి మిగతా 30ని ప్రీమియం తత్కాల్ కోటాలో పెట్టారు. సెకండ్ సిట్టింగ్ సీట్లలో జనరల్‌లో 23 నుంచి 20కి తగ్గించి తత్కాల్ కోటాని ఆరు నుంచి తొమ్మిదికి పెంచారు. నంబరు. 17240 విశాఖపట్టణం - గుంటూ రు సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌కు కూడా పెద్దగా డిమాండ్ ఉండదు. అయినప్పటికీ ఈ రైలుకు కూడా ప్రీమియం తత్కాల్ కోట పెట్టి ఏసీ ఛైర్ కార్ 5, సెకండ్ సిట్టింగ్ సీట్లు 20గా నిర్ణయించారు. ప్రీమియం తత్కాల్ కోటా లో పెట్టిన ఐదు ఏసీ ఛైర్‌కార్, 20 సెకండ్ సిట్టింగ్ సీట్లను జనరల్ కోటాలో కోత పెట్టి చేశారు. నంబరు. 22203 విశాఖపట్టణం - సికింద్రాబాద్ వయా గుంటూ రు దరంతో ట్రైవీక్లీ(వారంలో మూడు రోజులు) ఎక్స్‌ప్రెస్‌కి డిమాండ్ చాలా తక్కువగా ఉంటుంది. దీనిని కూడా ప్రీమియం తత్కాల్ కోటాని చేర్చారు. ఏసీ టూటైర్ 20, ఏసీ త్రీటైర్ 50, సెకండ్ సిట్టింగ్ మూడు సీట్లన ప్రీమియం తత్కాల్ కోటాలో పెట్టడం వలన జనరల్ కోటాకు కోత పడింది. కేవలం ఆదాయం పెంచుకోవడానికే రైల్వే శాఖ ఈ విధంగా ప్రీమియం తత్కాల్ కోటాని పైన పేర్కొన్న రైళ్లకు నిర్దేశించిందన్న అభిప్రాయం ప్రయాణీకుల నుంచి వ్యక్తమవుతున్నది. దీని వలన ప్రయాణీకులకు ఒరిగేది ఏమి ఉండదని, ఈ నిర్ణయాన్ని రైల్వే శాఖ సమీక్షించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భూ సమీకరణకు అంగీకరిస్తే ఈ ఏడాది నుంచే కౌలు

● లింగాపురం రైతులతో ఎమ్మెల్యే ప్రవీణ్



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): రెండవ దఫా రాజధాని అమరావతికి భూ సమీకరణ ద్వారా భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరిస్తే.. ఈ ఏడాది నుండే కౌలు అందజేయడం జరుగుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగాపురంలో గ్రామంలో భూ సమీకరణపై గ్రామ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రవీణ్ పాల్గొని రైతుల వినతులకు సమాధానం ఇచ్చారు. రాజధాని రైతులకు ఇచ్చిన ప్యాకేజీ ప్రకారమే రెండవ దఫా భూ సమీకరణ రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. మూడు గ్రామాలను యూనిట్‌గా రిటర్నబుల్ ప్లాట్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు జరిగిన పది గ్రామాల్లో రైతులు భూ సమీకరణకు సుముఖత వ్యక్తం చేశారని.. లింగాపురంతో పాటు అమరావతి, ధరణికోట రైతులు కూడా భూ సమీకరణకు అంగీకరిస్తే ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. తమకు కేటాయించే రిటర్నబుల్ ప్లాట్‌ల సమీపంలోనే ఐటీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, కౌలు రూ.40వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు న్యాయం చేయాలని, పెన్నా కాలువ వెళ్లే భూములను సమీకరణ ద్వారా తీసుకోవాలని, రిటర్నబుల్ ప్లాట్‌లను మెరక ప్రాంతంలో కేటాయించాలని, చదువుకున్న ప్రతి నిరుద్యోగికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇలా తమ డిమాండ్లను సభ ముందుంచారు. ఎమ్మెల్యే ప్రవీణ్ సమాదానం ఇస్తూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. సుమారు 100 ఎకరాలకు చెందిన పలువురు రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను ఎమ్మెల్యేకు అందజేశారు. తహసీల్దారు డానియేలు, ఎంపీడీఓ పార్వతి, సర్వేయర్ భాగ్యలక్ష్మి, సర్పంచ్ కె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ మహిళా లిఫ్టర్లకు పతకాలు



లిఫ్టర్లను సన్మానిస్తున్న కేఎల్‌యూ యాజమాన్యం

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 19 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్, ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్ షిప్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కేఎల్‌యూ మహిళా లిఫ్టర్లు స్క్వాడ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్టులో ప్రతిభ కనబరిచి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారు. డెహ్రాడూన్‌లో ఆదివారం జరిగిన ఏషియన్ యూనివర్సిటీ క్లాసిక్ లిఫ్టింగ్ కప్ 47 కిలోల విభాగంలో ఎం.షానూన్, 84 ప్లస్ విభాగంలో నగం జ్ఞానదివ్య, 84 కిలోల విభాగంలో షేక్ సబీనా స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారు. ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పురుషులు, మహిళల చాంపియన్ షిప్ టోర్నీలో 47 కిలోల విభాగంలో మధిర షానూన్ కాంస్యం, 84 ప్లస్ కిలోల విభాగంలో నగం జ్ఞానదివ్య రజతం, 84 కిలోల విభాగంలో షేక్ సబీనా స్వర్ణ పతకాలు సాధించారు. డీన్ ప్రసాద్, డాక్టర్ హబీబుల్లా ఖాన్, స్పోర్ట్స్ డైరెక్టర్ కాకర్ల హరికిషోర్, ప్రో వీసీలు డాక్టర్ రాజశేఖర్, ప్రసాద్, వెంకట్రామ్, రిజిస్ట్రారు సుబ్బారావు, వీసీ సారథివర్మ వారిని అభినందించారు.

ఆధునిక బోధన పద్ధతులపై అవగాహన అవసరం

● ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ

గుంటూరు (విద్య) మే 19 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులకు పరిశోధన, డేటా విశ్లేషణ, అకడమిక్ రచన, పాలసీ అనుసంధానంతో పాటు ఆధునిక బోధన పద్ధతులపై లోతైన అవగాహన అవసరమని యూనివర్సిటీ ఆఫ్ డిల్లీ ఫిలాసఫీ ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ పేర్కొన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సౌజన్యంతో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో "ఏ టూ వీక్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం ఫర్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ ఆన్ ఎన్‌హ్యాన్సింగ్ మెథడోలాజికల్ ఎక్స్‌పర్టైజ్ అండ్ టెక్నాలజికల్ అడాప్షన్" అనే అంశంపై రెండు వారాల కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. వర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ అదర్ ఇండియన్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ ఆధ్యర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోంది. ముఖ్య అతిథి ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ మాట్లాడుతూ గుణాత్మక, పరిమాణాత్మక పద్ధతులపై శిక్షణతోపాటు కేస్ స్టడీ, ఫీల్డ్ రిసెర్చ్ విధానాలపై మెథడాలజికల్ ట్రైనింగ్ అవసరమన్నారు. ఎన్ఐసీ మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎస్ఆర్ ప్రభు, వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆచార్య బాల గణపతి దేవరకొండ

42 సవర్ల బంగారం రికవరీ



మాట్లాడుతున్న నరసరావుపేట డీఎస్పీ కే నాగేశ్వరరావు

చిలకలూరిపేట, మే19 (ఆంధ్రజ్యోతి): మండలం పసుమర్రు గ్రామంలో వారం రోజుల కిందట జరిగిన భారీ దొంగతనం కేసును చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఛేదించారు. నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. యలగాల హనుమాయమ్మ అనే మహిళ ఇంటిలో దొంగతనం జరిగింది. సుమారు రూ.34 లక్షలు విలువ చేసే 42 సవర్ల బంగారు నగలు, సుమారు 60 గ్రాముల వెండి వస్తువులు, రాగి, ఇత్తడి సామగ్రిని దుండగులు చోరీ చేశారు. ఈ నెల 11న కేసు నమోదయింది. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై జి.అనిల్ కుమార్ ఇతర సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. చిలకలూరిపేటలోని డైక్ మన్ కాలనీకి చెందిన పేదాల రాముడు, మదర్ థెరిసా కాలనీకి చెందిన బీరా సిద్దు అనే ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. వారి నుంచి దొంగలించిన మొత్తం సొత్తును రికవరీ చేశారు. రాముడుపై చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్లో గతంలో ఒక దొంగతనం కేసు, నరసరావుపేట, బల్లికురవ పోలీస్‌స్టేషన్లలో బైండోవర్ కేసులు ఉన్నాయి. పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఎస్పీ.. సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్సై జి.అనిల్‌కుమార్, ఏఎస్ఐలు డి.రోసిబాబు, జి.సుబ్బారావు, హెడ్ కానిస్టేబుళ్లు దేవరాజు, శ్రీధర్, కానిస్టేబుళ్లు ఇర్మియా, అశోక్, రత్న కిషోర్, హోంగార్డు మధుబాబులను అభినందించారు.

పెదకొండాయిపాలెంలో 20 మందికి డయేరియా

ఈపూరు,మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొండాయిపాలెంలో సుమారు 20 మంది డయేరియాతో బాధపడుతూ విలేజ్ క్లీనిక్‌లో చేరారు. అక్కడ వైద్య సిబ్బంది వారికి చికిత్స చేశారు. గ్రామంలో మరికొందరు వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బందికి తెలియడంతో వారు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌ఓ రవి, డీపీఓ నాగేశ్వరరావు నాయక్ గ్రామానికి వచ్చి.. రోగులను పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. మురుగు కాల్వలను పరిశీలించారు. గ్రామంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్న వారు పెట్టిన చలిమిడి, సజ్జలు తినడం వల్లే అనారోగ్యానికి గురైనట్లు వైద్య, ఆరోగ్య సిబ్బంది తెలిపారు. తహసీల్దారు ఎ.నళిని, ఎంపీడీఓ కె.ప్రభాకర్ గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యదర్శి బి.కృష్ణాంజనేయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పీహెచ్ఎన్ లక్ష్మీనర్సమ్మ వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం గ్రామంలో డయేరియా అదుపులో ఉందని వైద్యులు తెలిపారు.



గ్రామంలో పర్యటిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ,పంచాయితీ,రెవెన్యూ అధికారులు

లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

వినుకొండటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతిచెందిన ఘటన మండలంలోని చీకటీగలపాలెం గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఓ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్న నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన కటికల విజయ్‌కుమార్ (28) పని ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. స్థానికులు వైద్యం నిమిత్తం అతనిని వినుకొండకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్థారించారు. మృతుడికి భార్య ఉంది.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



గోపి మృతదేహం

మాచర్లటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. కారెంపూడికి చెందిన వద్దుల గోపి (28)కి మాచర్ల పట్టణంలోని సుద్ధగుంతలకు చెందిన కోటేశ్వరితో పదేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో..వారు పది నెలల క్రితం మాచర్ల పట్టణంలోని సుద్ధగుంతలకు నివాసం వచ్చారు. పట్టణంలోని ఓ సెలూన్ పనిచేస్తున్న గోపీ.. మద్యానికి బానిస కావడంతో మూడు రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో భార్య కోటేశ్వరి పట్టణంలోని తన తల్లి ఇంటికి వెళ్లిపోయింది. రాత్రి గోపీ తన స్నేహితుడు సురేష్‌కు ఫోన్ చేసి టిఫిన్ తీసుకురమ్మని చెప్పాడు. సురేష్ ఇంటికి వెళ్లి చూడగా.. అప్పటికే గోపి ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకొని అపస్మారక స్థితిలో కనిపించాడు. చుట్టుపక్కల వారి సాయంతో గోపీని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

సైకిల్‌పై కడప మహానాడుకు ప్రయాణం

మరోసారి అభిమానం చాటిన షేక్ బాజీ



వినుకొండలో బాజీని అభినందిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

పిడుగురాళ్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): షేక్ బాజీ అనే టీడీపీ కార్యకర్త సోమవారం గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల నుంచి కడపలో జరిగే టీడీపీ మహానాడుకు చేరుకోవడానికి సైకిల్‌పై యాత్ర ప్రారంభించారు. గతంలో కూడా మహానాడు ఎక్కడ జరిగినా అక్కడికి సైకిల్‌పై వెళ్లి పార్టీ పట్ల అభిమానం చాటుకున్నాడు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు జెండా ఊపి అతని సైకిల్ యాత్రను ప్రారంభించారు. పార్టీ పట్ల బాజీ నిబద్ధత, పట్టుదల అందరికీ స్ఫూర్తిదాయకం అని అతనికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, యువ నేత నిఖిల్ అభినందనలు తెలిపారు. సాయంత్రం వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును బాజీ కలిశారు. బాజీ చేపట్టిన సైకిల్ యాత్రను జీవీ అభినందించారు.

బొలెరో ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి



మృతుడు కుందూరు బ్రహ్మయ్య

తాడేపల్లి (ఉండవల్లి), మే 19 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి - పెనుమాక మార్గ మధ్యలో ఉండవల్లి గుహలకు సమీపంలో అతి వేగంతో వెళ్తున్న బొలెరో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలను, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న పెనుమాకకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కుందూరు బ్రహ్మయ్య (60) మృతి చెందగా.. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. బొలెరో డ్రైవర్ మల్కాపురానికి చెందిన నరేష్ మద్యం మత్తులో ఉండటం వల్లే ఈ ఘటన జరిగిందని తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజ్ తెలిపారు. బ్రహ్మయ్యకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. బ్రహ్మయ్య మృతిపట్ల టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేష నాయకులు సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నాదెండ్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో చేకూరి హనుమంతరావు(70) అనే రైతు సోమవారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఆయనకు నాదెండ్ల - తూబాడు మార్గం సమీపంలో వ్యవసాయ క్షేత్రం ఉంది. మధ్యాహ్నం వర్షం కురిసిన సమయంలో.. పొలాన్ని చూసేందుకు వెళ్లాడు. పొలానికి వేసిన ఫెన్సింగ్‌కు విద్యుత్ సరఫరా ఉన్న విషయాన్ని గుర్తించలేదు. సర్వీసు వైరు గాలి రాపిడికి తెగడంతో... హనుమంతరావు విద్యుదాఘాతానికి గురయ్యాడు. చుట్టు పక్కల రైతులు వెంటనే ఆయనను చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. నాదెండ్ల పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఈఏపీ సెట్

గుంటూరు (విద్య) మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఈఏపీ సెట్ సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైంది. గుంటూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 22 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బాపట్లలో 2, పల్నాడు జిల్లాలో 5, గుంటూరు జిల్లాలో 15 కేంద్రాలు ఉన్నాయి. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 3,575 మంది విద్యార్థులు హాజరయ్యారు. మంగళవారం కూడా ఫార్మసీ, అగ్రికల్చర్ పరీక్ష నిర్వహించనున్నారు. 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు జరుగుతాయి.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

దాచేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి టౌన్, మండలం, మాచవరం మండల పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు సమస్యల పరిష్కారం, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు దాచేపల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు తుమ్మల వీరేశ్వరరావు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు దాచేపల్లి నగర పంచాయతీలోని విజయభాస్కర కల్యాణ మండపంలో జరిగే ఈ సదస్సులో విద్యుత్ శాఖలో ఉన్న సందేహాలు, సమస్యలను తెలియపరచాలని వివరించారు. తక్షణమే పరిష్కారం, సూచనలు అందిచనున్నట్లు వివరించారు విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



చాగంటివారిపాలెం ఉప సర్పంచ్‌గా వెంకటరంగారెడ్డికి ఎన్నిక పత్రాన్ని అందజేస్తున్న ఈఓపీఆర్డీ రూపవతి

ఉపసర్పంచ్‌గా శివకోటి వెంకటరంగారెడ్డి

ముప్పాళ్ళ, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారిపాలెం ఉప సర్పంచ్‌గా అన్నపురెడ్డి శివకోటి వెంకటరంగారెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపసర్పంచ్ బి.మౌలాలి కొద్దిరోజుల క్రితం రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామ సచివాలయంలో ఉపసర్పంచ్ ఎన్నిక జరగగా శివకోటి వెంకటరంగారెడ్డిని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈఓపీఆర్డీ రూపవతి ధ్రువపత్రాన్ని రంగారెడ్డికి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పీలా గాయత్రీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పిన్నెల్లి ఉపసర్పంచ్‌గా సుబ్బారావు

మాచవరం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నెల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా సిరంగి సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో పనిచేసిన ఉప సర్పంచ్ రాజీనామా చేయటంతో ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో సోమవారం నిర్వహించిన ఉసపర్పంచ్ ఎన్నిక కార్యక్రమంలో మొత్తం 14 మంది సభ్యులకు పదిమంది హాజరయ్యారు. వీరంతా సుబ్బారావును ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ వ్యవహరించారు. సుబ్బారావు ఉపసర్పంచ్‌గా ఎన్నికైనట్టు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై
విచారణ జరిపించాలి

● కలెక్టర్‌కు కండ్లకుంట గ్రామస్తుల ఫిర్యాదు

నకరికల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కండ్లకుంట గ్రామంలో అక్రమాలు జరుగుతున్నాయని, వీటిపై విచారణ జరపాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం కలెక్టర్ అరుణ్‌బాబుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వేశ్వరరావు కూలీలు రెండు రోజులు వస్తే ఒక్క రోజే వచ్చినట్లు నమోదు చేస్తున్నారని, పనికి రానివారికి హాజరు వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలో లేనివారికి, అతని బంధువర్గానికి పనికి రాకపోయినా వచ్చినట్లు హాజరువేసి నీకింత.. నాకింత అంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ సిద్ధలింగమూర్తికి కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.



నారాయణపురంలో మాట్లాడుతున్న కాసా రాంబాబు

కార్మిక వ్యతిరేక విధానాలు
అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

దాచేపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు ఆరోపించారు. సోమవారం దాచేపల్లి నగర పంచాయతీ, నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో మండల సీపీఐ కార్యకర్తల సమావేశం జరిగింది. ప్రభుత్వాల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇళ్ళు, భూమి లేని పేదలకు వాటిని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, సీపీఐ సీనియర్ నాయకులు తెల్లనాకుల సత్యనారాయణ, వేముల వెంకటరెడ్డి, ఎడ్ల భాస్కర్, కొమెర వెంకటరావు, రంగా శాంతి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో ఆక్రమణలు తొలగించండి

క్రోసూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరికపాడు గ్రామంలో ఉన్న ఎస్సీ మాదిగ శ్మశాన వాటికను ఆక్రమణల బారినుంచి కాపాడాలని ఆ సామాజిక వర్గానికి చెందిన వారు సోమవారం క్రోసూరు తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో వంద కుటుంబాల వరకు నివాసం ఉంటున్నాయన్నారు. తమ కాలనీకి శ్మశానవాటికగా దొడ్లేరు - పెరికపాడు గ్రామాల మధ్య అలుగు దగ్గర ప్రభుత్వం 75 సెంట్ల పోరంబోకు భూమి పూర్వం కేటాయించిందన్నారు. అయితే పక్క పొలాల వారు ఈ స్థలాన్ని ఆక్రమించుకుంటూ వస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం శ్మశానస్థలం 20 సెంట్లు మాత్రమే ఉందన్నారు. విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు. తహసీల్దార్ వేముల నాగరాజు స్పందిస్తూ సంబంధిత అధికారులను సమస్య గురించి పరిశీలన చేయాలని ఆదేశించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గ్రామానికి చెందిన జడ సుబ్బు, మురికపూడి ఇజ్రాయేలు, నందిపాటి ఏసోబు, సిద్దెల దిలీప్, అశోక్, రామారావు, సైదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి కోళ్ళూరు
ప్రసన్నాంజనేయ జయంతి ఉత్సవాలు

బెల్లంకొండ, మే 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కోళ్ళూరు ప్రసన్నాంజనేయస్వామి జయంతి ఉత్సవాలను ఈనెల 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు మండల కార్యనిర్వాహణ అధికారి అవుదూరి వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

క్రీడలకు ప్రాధాన్యం

● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్

వెల్దుర్తి, మే 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని శిరిగిరిపాడులో ఆంజనేయస్వామి జయంతి సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన జాతీయస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కోరిక మేరకు మాచర్ల నియోజకవర్గానికి వంద పడకల ఆసుపత్రి కేటాయిస్తానన్నారు. ఈ ఆసుపత్రిని 300 పడకలకైనా పెంచడానికి సిద్ధంగా ఉన్నానని మంత్రి అనడంతో ప్రాంగణమంతా హర్షధ్వానాలతో హోరెత్తింది. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై యుద్ధం చేసి మాచర్ల ప్రజల్లో మానసిక స్థైర్యాన్ని నింపిన వ్యక్తి బ్రహ్మానందరెడ్డి అని కొనియాడారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తే క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. పల్నాడు ప్రజలు ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న వరికపూడిశెల సాధించే బాధ్యత తనదన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి నిధులు కేటాయించి అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముందుగా వెల్దుర్తిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రూ.1.50కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, ఆర్గనైజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ధారునాయక్, టీడీపీ సీనియర్ నేత సామినేని నరసయ్య, రాజబోయిన మధుసూదన్ యాదవ్, గుండాల శ్రీనివాస్ యాదవ్, వజ్రం నాయక్, బీజేపీ నేత కూనిశెట్టి వెంకటేశ్వర్లు, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన రహదారిపై నిలిచిన మురుగునీరు

డ్రెయిన్‌లు అధ్వానం

● రహదారిపై మురుగునీరు

మాచర్ల రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో డ్రెయినేజీ అధ్వానంగా తయారైంది. దీంతో డ్రెయిన్‌లలోని మురుగునీరు ప్రధాన రహదారిపైకి చేరి తటాకాన్ని తలపిస్తోంది. దీంతో ఆ మార్గాన ప్రయాణించాలంటే వాహనచోదకులు బెంబేలెత్తిపోతున్నారు. కాలినడకన సైతం నడవలేని దుస్థితి నెలకొంది. దీనికితోడు దోమలు వృద్ధి చెంది గ్రామస్తులు విషజ్వరాల బారిన పడుతున్నారు. దీనిపై ఎన్నిమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.



నరసరావుపేట రోడ్డు నుంచి దేచవరం వెళ్ళే రోడ్డులో చిలకలూరిపేట మేజరుపై ప్రమాదకరంగా ఉన్న వంతెన

చిలకలూరిపేట మేజరుపై
ప్రమాదకరంగా వంతెన

నకరికల్లు, మే 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రహదారి నుంచి దేచవరం వెళ్ళే రహదారిలో చిలకలూరిపేట మేజరుపై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. సైడు వాల్స్ లేకపోవటమే కాక వంతెన శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు వంతెన కూలి పోతుందోననే భయం ఈ మార్గాన ప్రయాణించే వారిని వెంటాడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఈ వంతెనను తొలగించి కొత్త వంతెనను నిర్మించాలని దేచవరం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

12 గ్రామాలు.. 17వేల మంది రైతులు.. 30వేల ఎకరాలు
రెండో దఫా భూసమీకరణకు సిద్ధం

అమరావతి, మే 19(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిని మహానగరంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్రప్రభుత్వం సంకల్పిస్తున్న రెండో దఫా భూసమీకరణ కార్యక్రమానికి అమరావతి మండలంలో 10 గ్రామాలలో 32,660 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. అందులో 15,036మంది రైతులకు చెందిన 25వేల ఎకరాలు భూమి సేకరించాల్సి ఉంది. ఇంకా ప్రభుత్వభూమి 5,533 ఎకరాలు, అసైన్డ్ భూమి 423ఎకరాలు, దేవదాయ, ఈనాం భూములు 3,320 ఎకరాలు, అటవీ, గ్రామకంఠం కింద 256 ఎకరాలు, కృష్ణా నది పరిధిలో 4,291 ఎకరాలు ఉన్నాయి. పదిరోజుల నుండి వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి రెవెన్యూ గ్రామాలలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధ్యక్షతన భూసమీకరణపై గ్రామ సభలు నిర్వహించారు. సభలకు హాజరైన రైతులలో అధికశాతం భూములు ప్రభుత్వానికి ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తంచేశారు. రాజధాని అమరావతి చుట్టూ నిర్మించబోయే ఇన్నర్ రింగ్‌రోడ్ నుండి పడమర వైపు పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని ప్రపోజల్‌లో ఉన్న ఔటర్‌రింగ్‌రోడ్ వరకు భూసమీకరణ లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. అందులో భాగంగా నియోజకవర్గంలోని అమరావతి మండలంలో పై నాలుగు రెవెన్యూ గ్రామాలతోపాటు మండెపూడి, ఉంగుటూరు, నరుకుళ్లపాడు, లింగాపురం గ్రామాలు పెదకూరపాడు మండలంలోని రెండు రెవెన్యూ గ్రామాలు కంభంపాడు, బలుసుపాడులో గ్రామసభలు సోమవారంతో ముగిశాయి. అమరావతి మండలంలోని ధరణికోట, అమరావతిలో గ్రామసభలు నిర్వహించాల్సి ఉంది. తొలుత రాజధాని అమరావతికి దగ్గరగా ఉన్న నాలుగు గ్రామాలలో భూసమీకరణకు నోటిఫికేషన్ విడుదల చేసి ఈ ఏడాది నుండే భూములు ఇచ్చిన రైతులకు కౌలు మంజూరుచేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. మిగిలిన గ్రామాలలో కూడా రైతులు ముందుకు వస్తే వారికికూడా ఈ సంవత్సరమే కౌలు మంజూరుచేసేలా చూస్తానని ఎమ్మెల్యే ప్రవీణ్ రైతులకు హామీ ఇస్తున్నారు. భూములు ఇచ్చేందుకు సమ్మతించకుండా పంటల సాగుకు ఇష్టపడే రైతుల భూములు గ్రీన్‌జోన్‌లో ఉంచి వారికి సాగుకు సంబంధించి ప్రభుత్వపరంగా అందే పథకాలు అందిస్తామని గ్రామసభలలో చెబుతున్నారు. వారంరోజులలో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తై రైతుల అభిప్రాయాలను బట్టి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. పెదకూరపాడు మండలంలోని బలుసుపాడు, కంభంపాడు గ్రామాలలో 2636 రైతులకుగాను 4585 ఎకరాలు భూసమీకరణ చేయాల్సి ఉంది. రెండు మండలాల్లోని 12 గ్రామాలలో 17,660మంది రైతులకు చెందిన 30వేల ఎకరాలు సమీకరించాల్సి ఉంటుంది.

క్రోసూరులో తిరంగా ర్యాలీ



తిరంగా యాత్రలో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్,



తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

క్రోసూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): క్రోసూరులో ఇటీవల పాకిస్థాన్‌పై జరిగిన సిందూర్ ఆపరేషన్‌కు మద్దతుగా తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి బుద్ధి చెప్పారన్నారు. పహల్గామ్ దాడిలో మృతిచెందిన వారికి, ఆపరేషన్ సిందూర్‌లో అశువులు బాసిన సైనికులకు ఇది నిజమైన నివాళి అన్నారు. 140 కోట్ల మంది భారతీయులు తిరంగా ర్యాలీకి మద్దతు తెలపటం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, నల్లపాటి రాము, నూర్జహాన్ బేగం, కంచేటి సాయిబాబు, ఏపూరి నాగేశ్వరరావు, నందిగం ఆశీర్వాదం, గుడిపాడు బాషా, కాంద్రు కాశయ్య తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీలో జాతీయ జెండాలు పట్టుకుని నినాదాలు చేశారు.

అణగారిన వర్గాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

● చెంచుకాలనీ లబ్ధిదారులకు
ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జూలకంటి



చెంచులకు పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, మే 19(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం వెల్దుర్తి క్యాంపు కార్యాలయంలో స్థానిక చెంచుకాలనీలోని లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. దశాబ్దంన్నర నిరీక్షణకు తెర పడిందన్నారు. 2018 టీడీపీ హయాంలో ఇళ్లు లేని నిరుపేద చెంచులను గుర్తించి నివేశనస్థలాలను మంజూరుచేస్తూ పట్టాలను తయారు చేసిందని, ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రాకతో పంపిణీ ప్రక్రియను మరుగున పడేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కో లబ్ధిదారుడికి మూడు సెంట్ల చొప్పున నివేశస్థలాలు అందించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాషా, ఆర్‌ఐ మస్తాన్‌వలి, వీఆర్వో శ్రీనివాసరావు, అయ్యప్ప, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అచ్చంపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



అచ్చంపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అచ్చంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సోమవారం ఆవిష్కరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పసుపులేటి పాపిరెడ్డి, సందెపోగు వెంకయ్య, గందం కోటేశ్వరావు, బుర్రి కిరణ్, నల్లమేకల వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీను, తిరువాయి పాటి ఆంజనేయులు, రాయిడి సాంబశివుడు, కొమ్మవరపు సుబ్బయ్య, చిలుకా లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



తాళ్ళచెరువు బాలయేసు దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బాలయేసు దేవాలయ
వార్షిక వేడుకల్లో ఎమ్మెల్యే

అచ్చంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళచెరువు బాలయేసు దేవాలయ 75 వసంతాల వజ్రోత్సవ వేడుకలలో మూడో రోజు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచారణ గురువులు డాక్టర్ పుట్టి అంతోనిరాజు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు.

నేడు పలు గ్రామాలలో
విద్యుత్ సరఫరా నిలిపివేత

ముప్పాళ్ళ, మే 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీ 11కెవీ బ్రేకర్, 11కెవీ లైన్‌ల మరమ్మతులు చేస్తున్న కారణంగా పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జి.సుచరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 వరకు మండలంలోని గోళ్ళపాడు, కుందురువారిపాలెం, తురకపాలెం, కొంకవారిపాలెం, లంకెలకూరపాడు, పలుదేవర్లపాడు, నార్నెపాడు, బొల్లవరం, దమ్మాలపాడు, రుద్రవరం గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

యువకుడు ఆత్మహత్య

మాచర్లటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి సరిగాలేక యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్లలో జరిగింది. నెహ్రూనగర్ మొదటిలైన్‌కు చెందిన సంకూరి సంతోష్‌కుమార్ (25) పదో తరగతి వరకు చదివి మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో ఇంటి వద్దనే ఉంటూ టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. సంతోష్‌కుమార్ తల్లి నాసరమ్మ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. సోమవారం ఉదయం 5 గంటలకు నాసరమ్మ పొలం వెళ్లింది. మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చిచూడగా సంతోష్‌కుమార్ దూలానికి చీరతో ఉరివేసుకొని విగతజీవిగా ఉన్నాడు. స్థానికుల సాయంతో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు సంతోష్‌కుమార్ అవివాహితుడు.



వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు

ఆలయ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు

రెంటచింతల, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూముల్లో గత కొద్ది రోజులుగా అక్రమంగా మట్టి తవ్వుతున్నట్లు ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సర్వే నం.168లో 8.12 ఎకరాలు ఉండగా, అందులో 2 ఎకరాల్లో మట్టిని పూర్తిగా తవ్వారన్నారు. 25 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పులో ఈ తవ్వకాలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి సిగ్గుచేటు

సత్తెనపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి సిగ్గుచేటని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్ పాల్, కాంగ్రెస్ నేతలు అన్నారు. సోమవారం పట్టణ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జేమ్స్‌ను కొట్టి కులం పేరుతో దూషించిన కేసులో నిందితులను పోలీసులు చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని వారు కోరారు. సమావేశంలో సిద్దెల మోహన్‌రావు, కొరబండి ఆంతోని, కే పాల్‌రాజు, ఏ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


మినీ మహానాడును
జయప్రదం చేయాలి

సత్తెనపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీ మంగళవారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జరగనున్న నియోజక వర్గ మినీ మహానాడుకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా జాన్ బాబు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

రేషన్‌కార్డు దరఖాస్తులు
ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● తహసీల్దార్ పుల్లారావు

నకరికల్లు, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే రేషన్‌కార్డు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి వీఆర్వోల ఈకేవైసీ ద్వారా వెంటనే మండల రెవెన్యూ కార్యాలయానికి పంపాలని తహసీల్దార్ పుల్లారావు ఆదేశించారు. సోమవారం నకరికల్లు -1 సచివాలయంలో రేషన్‌కార్డులు ఆన్‌లైన్ చేసే విధానాన్ని ఆయన పరిశీలించారు. దరఖాస్తుల నమోదులో ఏవైనా సాంకేతిక సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దరఖాస్తులు చేసే సమయంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ పుల్లారావుతోపాటు డిప్యూటీ తహసీల్దార్ తుమ్మా కొండారెడ్డి ఉన్నారు.



నకరికల్లు సచివాలయంలో రేషన్‌కార్డుల దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ పుల్లారావు, డీటీ కొండారెడ్డి


స్వర్ణ వెంకటేశ్వరస్వామి

నేటి నుంచి.. హనుమత్ జయంతి ఉత్సవాలు

- పొన్నూరు విచ్చేయనున్న దీక్ష పరులు
- ఉత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

పొన్నూరుటౌన్, మే 19(ఆంధ్రజ్యోతి) : పొన్నూరు పట్టణంలో ప్రసిద్ధి చెందిన వీరాంజనేయ స్వామి ఆలయం హనుమత్ జయంతి ఉత్సవాలకు ముస్తాబయింది. ఇక్కడి శ్రీ వీరాంజనేయ స్వామిని ఏక శిలా రూపంలో 1969లో ప్రతిష్టించారు. 24 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పు ఉన్న శ్రీ వీరాంజనేయ శిల్పాన్ని అద్భుత కళా నైపుణ్యంలో రూపొందించడమే కాకుండా గోష్టీవనాన్ని వ్యయ ప్రయాలకు ఓర్చి తరలించి ప్రతిష్టించారు. ఈ భారీ వీరాంజనేయ స్వామిని , వీక్షించి పూజించేందుకు ప్రతి ఏటా జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి హనుమత్ దీక్షా పరులు పెద్ద ఎత్తున తరలి వస్తారు. అంతే కాకుండా ఈ ఆలయంలోనే కొలువు దీరిన మహా వీర గరుత్మంత స్వామి విగ్రహం, 30 అడుగల ఎత్తుతో, 15 అడుగుల వెడల్పుతో భక్తులను ఆకర్షిసుంది. ఐదెకరాల సువిశాల ప్రాంగణంలో కొలువు దీరిన మరో ఆలయం సహస్ర లింగేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్ లింగరూపంలోనూ మరో వైపు విగ్రహ రూపంలోనూ భక్తులు దర్శించుకోవచ్చు. అంతే కాకుండా 1108 శివలింగాలు నిరంతరం భక్తుల పూజలు అందుకుంటున్నాయి. అలాగే దశావతారాల ఆలయం, సర్వపాప విమోచన కర కాలభైరవ స్వామి ఆలయం, వంటి ఎన్నో విశిష్టతలు కలిగిన ఉపాలయాలతో పాటు 5 అఖండ జ్యోతుల మందిరాల సైతం ఈ ఆలయంలోనే భక్తుల పూజలు అందుకుంటున్నాయి. నేడు శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలకు అంకురార్పణ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. 21, 22 తేదీలలో తెల్లవారుజామున వీరాంజనేయ స్వామి వారి విగ్రహానికి మంత్ర జలాలు, పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు. హనుమత్ జయంతి రోజున స్వామి వారికి ప్రీతికరమైన నాగవల్లి దళాలు(తమలపాకులు), లక్ష మల్లెల పూజలు, శ్రీ సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి దివ్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఆలయంలో ఏర్పాట్లు జరిగాయి.


ఏకశిల వీరాంజనేయ స్వామి

ఎమినిటీస్ సెక్రెటరీలు ఎక్కడ?

- చాలామంది దీర్ఘకాలిక సెలవులోకి
- అనుమతి లేకుండానే కొందరు గైర్హాజరు
- 2ఏళ్ల తర్వాత వచ్చినా జాయినింగ్ ఆర్డర్స్

గుంటూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో ఎమినిటీస్ సెక్రెటరీలుగా నియమితులైన ఇంజనీరింగ్ పట్టభద్రులు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లిపోతున్నారు. ఇప్పటివరకు వాళ్లకు సక్రమంగా ప్రమోషన్ ఛానల్ డిజైన్ కాకపోవడం, జీతాలు చూడబోతే రూ. 30 వేలకు కొంచెం అటుఇటుగానే నెలకు వస్తుండటంతో ఎమినిటీస్ సెక్రెటరీలుగా కొనసాగలేకపోతున్నారు. ఇక్కడ అధికారులు, కార్పొరేటర్లు/కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తగిన గౌరవం కూడా ఇవ్వకపోతుండటంతో వేరే దారి వెతుక్కుంటున్నారు. కొందరైతే ఇప్పటికే విదేశాలకు వెళ్లిపోయి అక్కడ ఎంఎస్ పూర్తి చేసి ఉద్యోగాలు తెచ్చుకొని ఆయా దేశాల్లో కొనసాగుతున్నారు. మరికొందరు హైదరాబాద్/బెంగళూరు/చెన్నైలోని ఐటీ కంపెనీల్లో మంచి ప్యాకేజీ ఉద్యోగాల్లో చేరారు. ఇంకొందరు ఏపీసీఆర్‌డీఏ, హౌసింగ్, మునిసిపల్ ఇంజనీర్-ఇన్-చీఫ్ కార్యాలయాలకు డిప్యుటేషన్లపై వెళ్లిపోతున్నారు.

ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వ హయాంలో పరీక్షలు పెట్టి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎమినిటీస్ సెక్రెటరీలుగా పోస్టింగ్‌లు చేశారు. ప్రభుత్వ ఉద్యోగం కావడంతో చాలామంది పట్టభద్రులు అప్పటికే వివిధ కంపెనీల్లో నెలకు రూ. 60 వేల నుంచి రూ. 80 వేల వరకు ఉన్న జీతాలను కూడా వదులుకొని వచ్చి రూ. 15 వేల జీతంపై విధుల్లో చేరారు. జీతం పేస్కేల్ నిర్ణయించడానికి ఎక్కువ సమయం అప్పటి ప్రభుత్వం తీసుకోవడంతో తమ భవిష్యత్తు ఎక్కడ అంధకారం అవుతుందోనని చాలామంది ప్రత్యామ్నాయం చూసుకొన్నారు. గుంటూరు నగరంలోనే పది నుంచి 20 మంది మధ్యన ఎమినిటీస్ సెక్రెటరీలు ఎలాంటి అనుమతి తీసుకోకుండానే విదేశాలకు వెళ్లిపోయి అక్కడ చదువు పూర్తి చేసి ఉద్యోగాలు చేసుకొంటున్నారు. ఒక ఉద్యోగి అయితే రైల్వేలో మెకానికల్ విభాగంలో మంచి ఉద్యోగం తెచ్చుకొని వెళ్లిపోయాడు. మరో ఎమినిటీస్ సెక్రెటరీ టీసీఎస్‌లోకి వెళ్లారు. సత్తెనపల్లిలో అయితే అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధి ఒక ఉద్యోగిని తీవ్రంగా అవమానించడంతో అతను ఉద్యోగం వదిలేసి ప్రతిష్ఠాత్మకమైన సంస్థలో ఎంబీఏ పూర్తి చేసి నేడు మంచి పొజిషన్‌కు చేరుకొన్నారు. ఉన్న కొద్దిమందికి నాలుగైదు సచివాలయాలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. కొంతమందిని ఏపీసీఆర్‌డీఏ డిప్యుటేషన్‌పై తీసుకొన్నది. హౌసింగ్, ఈఎన్‌సీ కార్యాలయాలు కూడా కొందరిని తీసేసుకోవడంతో జిల్లా వ్యాప్తంగా ఎమినిటీస్ సెక్రెటరీల సంఖ్య తగ్గిపోయింది. ఇలా ఎలాంటి అనుమతి తీసుకోకుండా వెళ్లిన వాళ్లలో కొందరు వెనక్కు రాగా సంబంధిత అధికారులు ఫైళ్లు నడిపి జాయినింగ్ ఆర్డర్స్ ఇచ్చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఒక సచివాలయంలో ఎమిని టీస్ సెక్రెటరీ/ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రెటరీలలో ఒకరు మాత్రమే ఉండాలని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో అయితే ఇంజనీరింగ్/ఎనర్జీ అసిస్టెంట్‌లలో ఒకరే ఉండాలని పేర్కొన్నది.

హార్వెస్టర్ కోత.. పశు పోషణకు వాత

- పెరిగిన ఎండుగడ్డి ధరలు
- తగ్గుతున్న సంప్రదాయ కోతలు
- నానాటికి తగ్గుముఖం పడుతున్న పాడిరైతులు


పంటపొలాల్లో అక్కడక్కడా ఉన్న పచ్చిమేత మేస్తున్న పశువులు

తెనాలి రూరల్,మే19 (ఆంధ్రజ్యోతి): ఎండుగడ్డి ధరలు నానాటికి పెరిగిపోతుండటంతో పశుపోషకులు తలకు మించిన భారంగా మారి ఆందోళన చెందుతున్నారు. కృష్ణా డెల్టాలో దాదాపుగా ఖరీఫ్‌లో 5 లక్షల ఎకరాలకు పైగా వరి సాగయింది. పంటలు కూడా బాగా పండాయి. పంటలు చేతికి వచ్చే సమయానికి వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో ఎక్కువ సంఖ్యలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునేలా హార్వెస్టర్లతో కోతలు కోయిస్తున్నారు. వీటి ద్వారా అయితే ఎప్పటి ధాన్యం అప్పుడు వెలుపలకు తరలించుకునే అవకాశం ఉంటుంది. పైగా కూలీల ఖర్చుకూడా తగ్గుతుందన్న ఉద్దేశంతో సంప్రదాయ కోతలు, కుప్పలూ, నూర్పిడిల వైపు మొగ్గు చూపడంలేదు. హార్వెస్టర్‌తో వరిపైర్లను కోతలు కోయించే క్రమంలో ఎండుగడ్డి ముక్కలుగా అవడంతో పశుపోషణకు వినియోగించుకునే పరిస్థితి అతితక్కువగా ఉంటుంది. సంప్రదాయ నూర్పిడి వల్ల ఎండుగడ్డి ముక్కలవ్వకుండా లభించడంతో పాటు వాటిని కట్టలుగా కట్టి పశువులకు మేతగా వినియోగించుకోవచ్చు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా రైతాంగం 75శాతం వరకూ హార్వెస్టర్లతోనే కోతలు కోయించడానికి మక్కువ చూపుతున్నారు. మిగిలిన 25శాతం మంది మాత్రమే సంప్రదాయ కోతలను కోయిస్తూ కుప్పలు వేయించి ధాన్యం తీసుకుంటూ ఎండుగడ్డిని పశుపోషణకు తరలించుకుంటున్నారు. డెల్టా ప్రాంతం కావడంతో రెండో పంట రబీసాగుకు ముందే కోతల అనంతరం హార్వెస్టర్‌తో కోయించి ఎండుగడ్డి ముక్కలను రైతులు 90శాతం పొలాల్లోనే తగలబెట్టడంతో గడ్డి అగ్నికి ఆహుతై బూడిదగా మారుతుంది. మిగిలిన 10శాతం రైతులు మాత్రమే ఆ గడ్డిని కట్టలు కట్టి ట్రాక్టర్ మిషన్ ద్వారా ఉండలుగా చుట్టించుకుని తరలించుకునే పరిస్థితి. ఈ పరిణామాలతో ఎండుగడ్డి కొరత తీవ్రమవుతోంది. ఒక్క ఎండుగడ్డికే పాడిరైతు దాదాపుగా రూ.12000 నుంచి రూ. 15000 వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వీటికి తోడు దాణా, పచ్చిగడ్డి, తవుడు, బెల్లం వంటి వాటి ధరలు కూడా పెరగడంతో పశుపోషణ భారంగా మారి పాడిరైతులు పశుపెంపకాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఏ గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇంట చూసినా పాడిగేదెలు ఉండేవి. రాను రాను అవి క్రమేపీ తగ్గుతూ 10 ఇళ్లకు ఒక గేదె వంతున పెంపకం దారులుగా ఉంటున్నారు. ఇదే కొనసాగితే పశుపెంపకం దారులు తగ్గి పాల కొరత ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వం పాడి పరిశ్రమను అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు సాగితే తప్ప దీనికి పరిష్కారం లభించదని పలువురు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ట్రాక్టర్‌తో తెనాలి ప్రాంతానికి తీసుకువస్తున్న ఎండుగడ్డి

ప్రారంభమైన కళా పరిషత్ నాటిక పోటీలు

వినుకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకొని ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నాటిక పోటీలను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ముందుగా నటరాజు, ఎన్టీఆర్‌లకు పూజలు నిర్వహించారు. శివశక్తి లీలా ఫౌండేషన్ ఛైర్మన్ లీలావతి, మాజీ ఎమ్మెల్యే మక్కెన భార్య మక్కెన పద్మావతి, ప్రభుత్వ న్యాయవాది ముప్పాళ్ల కల్పణ పాల్గొని జ్యోతి వెలిగించి నాటికల పోటీలను ప్రారంభించారు. మొదటి రోజు శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటిక, ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి కిడ్నాప్ నాటికలను శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీలను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యేలు సతీసమేతంగా తిలకించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ముత్తినేని గిరిబాబు, బొల్లా వెంకట కోటయ్య, జ్ఞానేశ్వరరావు, రామకోటేశ్వరరావు, కౌన్సిలర్ షకీలా బేగం, జనసేన పార్టీ నాగశ్రీను రాయల్, తదితరులు పాల్గొన్నారు.



జనరల్ బోగీలు నాటికలోని సన్నివేశం


నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన

అవగాహనతో.. చౌడు భూముల్లో సిరులు


బాపట్లలోని అఖిలభారత సమన్వయ ఉప్పునీటి పరిశోధన కేంద్రం

బాపట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సమీపిస్తోంది. సాగుకు రైతు భూమి సిద్ధం చేయడానికి సమాయత్తమవుతున్నారు. భూమి యాజమాన్య పద్ధతుల్లో రైతులు అనాదిగా ఒకే విధమైన పద్ధతులు పాటిస్తున్నారు. దీంతో సరయిన దిగుబడులు సాధించలేకపోతున్నారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో సముద్ర జలాలు భూగర్భంలో చొచ్చుకు వస్తున్నాయి. దీంతో పలు చోట్ల భూములు చౌడుబారుతున్నాయి. రైతులకు ఆ భూముల యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉండడం లేదు. ఈ నేపథ్యంలో వాటి యాజమాన్య పద్ధతులను వ్యవసాయ శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు.

ఉప్పునేలలు (తెల్ల,పాలచౌడు) : భూ ఉపరితలంపై తెల్లపొరలాగా ఏర్పడటం తగినంత తేమ ఉన్నప్పటికి మొక్కలు వడిలిపోవటం జరుగుతుంది. వర్షపాతం తక్కువగా ఉండి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే ప్రాంతాలలోని భూముల్లో నీరు ఆవిరయి వాతావరణంలో కలుస్తుంది. ఈ సమయంలో భూమిలో ఉన్న లవణాలు నీటి ద్వారా భూమి పై పొరలోకి వస్తాయి. నీటిమట్టం భూమి ఉపరితలానికి అతిదగ్గరగా ఉన్న నేలల్లో సహజంగా లవణ శాతం అధికంగా ఉంటుంది. మురుగునీరు పోయే వసతి లేని ప్రాంతాలలోను, కావాల్సిన పరిమాణం కన్న ఎక్కువనీరు ఉపయోగించినప్పుడు, లవణాలతో కూడిన నీరు సాగుకు వాడినప్పుడు పాలచౌడుగా మారుతాయి.


సముద్రతీర ప్రాంత గ్రామాలలోని పాలచౌడు భూములు

లక్షణాలు

నేలపై పొరలలో బుడిద రంగుగల ఉప్పు పొక్కు గట్టి తెల్లగా పేరుకుంటాయి. ఈ లక్షణాలు వేసవి చివరిలో బాగా కనిపిస్తాయి. ఈ భూములు వర్షాలు పడగానే దున్ని విత్తనాలు చల్లితే మొలకెత్తావు. మొలకెత్తిన పైరు పెరుగుదల, సాంద్రత తక్కువగా ఉంటుంది. నీరు ఇంకే శక్తి మాములు కంటే ఎక్కువగా ఉంటుంది. నీరు పొలంలో ఉన్నప్పటికి పైరుకు అందక మొక్కఆకులు ముడుచుకుపోయినట్లు కనపడుతాయి. సమస్య ఎక్కువ అయినప్పుడు మొక్కలు చనిపోతాయి. ఈ భూములలో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉంటుంది.

యాజమాన్యపద్ధతులు

ఉప్పునేలలను బాగు చేయటానికి నేలలో ఉన్న నీటిలో కరిగే లవణాలను తొలిగించాలి. ఈనేలలను బాగు చేయటానికి మంచి నీరు అవసరం. నేలపై పేరుకుపోయిన ఉప్పు లేక తెల్లచౌడును పారలతో తొలిగించాలి. వాలును బట్టి పొలాన్ని చిన్నచిన్న మడులుగా చేసుకోవాలి. ప్రతిమడికి నీరు పెట్టి కాల్వల ద్వారా బయటకు పంపించాలి. ప్రతిమడిలో 15-20 అంగుళాల వరకు నీరు పెట్టి బాగా దమ్ము చేయాలి ఈవిధంగా చేయటం వలన నీటిలో లవణాలు కరుగుతాయి. నాలుగురోజుల తర్వాత ఇంకిపోగా మిగిలిన నీటిని మురుగుకాల్వ ద్వారా బయటకు పంపాలి. ఈవిధంగా లవణాలు తొలిగిపోయే వరకు మళ్ళీ మళ్ళీ చేయాలి. అదేవిధంగా పచ్చిరొట్ట, పశువుల ఎరువు, సూపర్ ఫాస్ఫేట్‌ను ఎక్కువగా వాడాలి. క్లోరైడ్, సల్ఫేట్ కలిగిన ఎరువులను వాడరాదు. అధికమోతాదులో నత్రజని ఎరువును వాడాలి. సేంద్రియ ఎరువు, జీవన ఎరువులు, రసాయనిక ఎరువులు కలిపి వాడితే మంచి ఫలితాలు పొందవచ్చు. ఈభూములలో ఎక్కువ సాంద్రతలో మొక్కలు ఉండేవిధంగా చూడాలి. ఈ భూములకు ఎక్కువగా ఆమ్ల గుణం, అమోనియం సల్ఫేట్, యూరియా ఎరువులను వాడుటం మేలు. వీటిని చివరి దమ్ములో వేయాలి.

నల్లచౌడుభూములు (క్షార) : మురుగునీరు నిల్వ ఉండటం, నేల గట్టిపడటం, తక్కువనీరు ఇంకేగుణం, నీరు, మట్టికోత, మట్టి రేణువులు విడిపోవటం వల్ల నల్లనిరంగు సంతరించుకుంటుంది. మొక్కల పెరుగుదల క్షీణించి ఆకుల అంచుల వెంబడి ఎండి మాడిపోతాయి.

లక్షణాలు

నల్లచౌడుభూములు వర్షా కాలం వచ్చేసరికి భూమిపై నల్లకప్పు ఏర్పడుతుంది. ఉదజని సూచిక 8.3 కన్న ఎక్కువ. లవణశాతం 4.0 కన్న తక్కువగా మార్పిడి చెంది సోడియం 15శాతం కన్న ఎక్కువగా ఉంటుంది. నేలలో కణములు విడివిడిగా ఉండటం వలన నేలలో రంధ్రాలు పూడిపోతాయి. నేలలోనికి గాలిని, నీటిని ప్రవేశించనీయవు. మొక్కల జీవనప్రక్రియ సరిగ్గా జరగదు. ఎక్కువ కాలం తేమ ఉంటుంది. ఎండిన తర్వాత నేల చాలా గట్టి పడుతుంది. ఈభూములలో సోడియం కార్బోనేట్స్, బైకార్బోనేట్స్ ఎక్కువ మోతాదులో ఉంటాయి. ఈ భూములలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది.

యాజమాన్యపద్ధతులు

ఈనేలలను బాగుచేయటం అంటే సోడియం తొలిగించటం, ఉదజని సూచిక తగ్గించటం ఈభూములను బాగుచేయటానికి జిప్సం, పైరైట్స్ అను పదార్థాలను ఉపయోగించవలెను. వీటిల్లో జిప్సం విరివిగా వాడుతారు. ఇందులో మొక్కకు కావాల్సిన కాల్షియం, గంధకం రెండు పోషకపదార్థాలు ఉన్నాయి. కాల్షియం లోపల ఉన్న భూముల్లో జిప్సంను, కాల్షియం కార్బోనేట్స్ ఎక్కువగా ఉన్న భూములలో పైరైట్స్ లేదా పశువుల ఎరువు వాడాలి. భూమిని చిన్నచిన్న మడులుగా ఏర్పాటు చేసి 0.1శాతం వాలు ఉండేటట్లు చూడాలి. నీరు పెట్టుటకు, తీయటకు వేర్వేరు కాల్వలు తయారు చేయాలి. మంచినీటి వసతి సమృద్ధిగా ఉండాలి. ఈభూములలో జీలుగను పెంచి పూతకు వచ్చినప్పుడు కలియదున్నాలి. రెండు,మూడు సంవత్సరాలు వరుసగా ఈ ప్రక్రియ చేపడితే నల్లచౌడు పూర్తిగా విరిగి పైర్లు బాగా ఎదిగి దిగుబడులు వస్తాయి. ఈ భూములలో నత్రజని, జింకు పోషక పదార్థాలు చాలా తక్కువగా ఉంటాయి. కావున పొలాలు బాగు చేసిన తర్వాత వీటిని తప్పకుండా వాడాలి. అమోనియా సల్ఫేట్, కాల్షియం, అమోనియానైట్రేట్ ఎరువులు యూరియా కన్నా బాగా ఉపయోగపడతాయి. ఈభూములలో 1,2 సంవత్సరాలు పొటాష్ అవసరం ఉండదు. ఈభూములకు పశువుల ఎరువు, పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు వాడకం చాలా ఉపయోగంగా ఉంటుంది.

యాజమాన్యపద్ధతులు చేపట్టాలి

అఖిలభారత సమన్వయ ఉప్పునీటి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పి.మధువాణి



తీరప్రాంత గ్రామాలలో భూగర్భ నీరు ఉప్పుగా ఉంటుంది కాబట్టి ఈ నేలలు ఏర్పడుతాయి. వీటిని పునరుద్ధరించటానికి తగిన సూచనలు, సలహాలు పాటించాలి. విచ్చలవిడిగా ఎరువులు వాడరాదు. వర్షాలు తక్కువగా, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఈభూములు కనిపిస్తాయి. మంచినీటితో పొలాలను శుద్ధి చేసుకోవాలి. పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువులు ఎంతోమేలు చేస్తాయి.


దుర్గిలో జరిగిన శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి , ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

విద్యాలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి
- కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

దుర్గి, కారంపూడి మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బంగారు భవిష్యత్‌కు పునాదులే విద్యాలయాలు అని విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. దుర్గిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం, ఆదర్శ పాఠశాల, కారంపూడిలోని కేజీబీవీలో పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. దుర్గి కస్తూర్బాగాంధీ గిరిజన బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రూ.1,51,50,000 ఆదర్శ పాఠశాలలో బాలికల వసతిగృహ నిర్మాణం కోసం రూ.1,72,86,000 మంజూరైనట్లు తెలిపారు. కారంపూడి కేజీబీవీలో రూ. 1.50 కోట్లతో వసతి గృహం, అదనపు గదులు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ వసతి గృహం లేక విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి.. మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే నిధులు మంజూరు చేశారని వెల్లడించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని మంత్రి పేర్కొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ పల్నాడు జిల్లా అభివృద్ధిలో దూసుకెళ్తోందని, తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా చేసేందుకు వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులను వైన్స్‌ల వద్ద కాపలా ఉంచారని, దోచుకో.. దాచుకో అన్న చందాన వ్యవహరించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కూడా గడవకముందే రోడ్ల నిర్మాణంతో పాటు పాఠశాలల అభివృద్ధికి మాచర్ల నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో నిధులు రావడం అదృష్టమన్నారు. అనంతరం మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కారంపూడి మండలంలోని మిర్యాల గ్రామం ఎస్సీ కాలనీ వాసులు ఆ గ్రామ నేత దారెడ్డి ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, కారంపూడి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, ఎంపీపీ యేచూరి సునీతా శంకర్, దారునాయక్, యాగంటి మల్లికార్జునరావు, ఇతర నాయకులు, మండలాధికారులు పాల్గొన్నారు.


కారంపూడిలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు హనుమాన్ జయంతి

వినుకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): గుంటి ఆంజనేయస్వామి ఆవరణలో హనుమాన్ జయంతి కార్యక్రమాలు మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యనిర్వాహకులు కొల్లి హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం 6గంటల నుంచి అష్టోత్తరశత కలశ పూజా కార్యక్రమాలతో పాటు స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు పూజా కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి పూజా కార్యక్రమాలు తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మొదటి పట్టణ ఎస్‌ఐ అరుణపై ఫిర్యాదు

నరసరావుపేట లీగల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మొదటి పట్టణ ఎస్‌ఐ అరుణపై సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఓ ఫిర్యాదుపై చర్యలు తీసుకోకపోవటంపై ఫిర్యాదు చేశారు. మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని 14సంవత్సరాల బాలికను అదే ప్రాంతానికి చెందిన ఓ 16సంవత్సరాల యువకుడు ప్రేమించమని గత కొంతకాలంగా వేధిస్తున్నాడు. ఈ విషయమై మొదటి పట్టణ ఎస్‌ఐ అరుణకు ఫిర్యాదు చేసినా ఆమె సరైన చర్యలు తీసుకోవడం లేదంటూ బాలిక కుటుంబ సభ్యులు సోమవారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్పీ దీనిపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

● ప్రిన్సిపాల్ రవినాయక్

రొంపిచర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవినాయక్ సోమవారం తెలిపారు ఇటీవల పదో తరగతి పరీక్ష పాసైన విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ఒక్కొక్క గ్రూపునకు 40సీట్లు ఉన్నాయి అన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటేశ్వర స్వామి

వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం పూజలు

నరసరావుపేట అర్బన్, మే 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కూటమి ప్రభుత్వంతోనే నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి

● కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల

ఈపూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందిస్తుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. ఈపూరు వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం మండల నాయీ బ్రాహ్మణుల సంఘం సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా గంగాధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో చెప్పినవిధంగా సెలూన్ షాపులు ఉన్న ప్రతిఒక్క నాయీ బ్రాహ్మణులకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వడం హర్షణీయమన్నారు. ఆదరణ పథకం కోసం కేటాయించిన వెయ్యికోట్లు బడ్జెట్‌లో వృత్తిపరమైన పనిముట్లు అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ప్రతి దేవాలయ ట్రస్ట్ బోర్డులో సభ్యులుగా నాయీబ్రాహ్మణులను నియమించడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు. సమావేశంలో మండల నాయీబ్రాహ్మణుల నాయకులు సీహెచ్ శ్రీనివాసరావు, చీమకుర్తి ఆంజనేయులు, సింహాద్రి, హనుమ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌కుమార్

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 150 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో డీఆర్‌వో మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు ● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 72 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ అంశాలకు సంబంధించి ప్రజల వద్ద నుంచి 72 ఫిర్యాదులు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. ఎస్పీకి వచ్చిన ఫిర్యాదుల వివరాలు ఇలా ఉన్నాయి. పిడుగురాళ్ల మండలం పాత గణేశుని పాడు గ్రామానికి చెందిన వెన్ను కీర్తన తనకు అచ్చంపేట గ్రామానికి చెందిన వేపూరి వెంకటేశ్వర్లుతో రెండు సంవత్సరాల క్రితం వివాహమైందన్నారు. వివాహమైన పుటి నుంచి భర్త, అత్త వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. సత్తెనపల్లి మండలం కందులూరిపాలెం గ్రామానికి చెందిన కొమెర అఖిలకు మూడు సంవత్సరాల క్రితం అదే గ్రామానికి చెందిన అనిల్‌తో వివాహం అయింది. వీరికి ఇద్దరు సంతానం కలిగిన తర్వాత భర్త అనిల్ చెడు అలవాట్లకు బానిసై అకారణంగా కొడుతూ సంవత్సరం క్రితం ఇంటి నుంచి వెళ్ళ కొట్టాడు. అప్పటి నుంచి తల్లి ఇంటి వద్ద ఉంటున్నానని అక్కడకు కూడా వచ్చి గొడవ చేస్తూ తనను, తల్లి సావిత్రిని చంపుతానని బెదిరిస్తున్నట్లు అఖిల ఫిర్యాదు చేసింది. భర్త, అత్తమామలు మానసికంగా శారీరకంగా వేధిస్తున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేసింది. అమరావతి మండలం లేమల్లె గ్రామానికి చెందిన కోపూరు సునీల్ కుమార్, అతని సోదరి సంధ్యారాణికి సంబంధించిన ఉమ్మడి భూమిని (ఒక ఎకరం 20సెంట్లు) హైదరాబాదుకు చెందిన ఉమామహేశ్వరరావుకు ఏడు సంవత్సరాల క్రితం తనఖా పెట్టి రూ.25,00,000లు అప్పు తీసుకొని, నెలకు 1.50చొప్పున వడ్డీ మాట్లాడుకున్నారు. అనంతరం అసలు వడ్డీ తొమ్మిది లక్షలు చెల్లించి పొలాన్ని విడిపించుకునేందుకు ఉమామహేశ్వరరావుకు తెలియపరచినా తప్పించుకుని తిరుగుతూ, పొలం చూడటానికి వెళ్తే ఉమామహేశ్వరరావు, కౌలుదారులతో కలసి ఇబ్బంది పెడుతున్నట్లు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. నరసరావుపేట పెద్ద చెరువుకు చెందిన కొల్లి రామారావు



ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

కొనికి గురుప్రసాద్ కు చీటీపాటలు కట్టినట్లు, చీటీ ఆపివేసి సుమారు 8 నెలలు అవుతుండగా డబ్బులు ఇవ్వమని అడుగగా తిడుతూ, దాడి చేస్తానని బెదిరిస్తున్నాడని చట్టపరమైన చర్యలు తీసుకొని డబ్బులు ఇప్పించాలని కొల్లి రామారావు ఎస్పీకి ఫిర్యాదుచేశారు. పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా రెండో కుమారుడు అయిన షేక్ ఖాజా మొహిద్దీన్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని నరసరావుపేట రావిపాడు ఐటీఐ కాలేజీలో ఉద్యోగం చేస్తున్న పుల్లగూర వేణు రెండు లక్షల రూపాయలు తీసుకొని ఎటువంటి ఉద్యోగం ఇప్పించలేదు. ఎన్నిసార్లు డబ్బులు అడిగినా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నట్లు తగు న్యాయం చేయాలని ఎస్పీకి అర్జీ ఇచ్చారు. నరసరావుపేట మండలం ములకలూరు గ్రామానికి చెందిన షేక్ యలవర్తిపాటి బాజీ పెద్ద కుమారుడు సైదా బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తిచేసి ఇంటి వద్ద ఖాళీగా ఉన్న సమయంలో వారి షాపుకి ఎదురుగా చికెన్ షాప్ నిర్వహిస్తున్న జ్యోతి కర్నూలుకు చెందిన తిరుమలేసు రెడ్డితో కలసి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఎనిమిది లక్షల రూపాయలు డబ్బులు తీసుకున్నారు. నకిలీ కాల్ లెటర్‌ను తమకు పంపారని విచారించగా అవి నకిలీవని తేలిందని తాను నగదు ఇవ్వాలని కోరగా తనపై దాడిచేసి బెదిరిస్తున్నారని తగు న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

నాటిక పోటీల నిర్వహణ గొప్ప విషయం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): ఓటీటీలు, సోషల్ మీడియా ప్రభావం అధికంగా ఉన్న ఈ కాలంలోనూ నాటికల పోటీలు నిర్వహించటం గొప్ప విషయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు నిర్వాహకులను ప్రశంసించారు. చిలకలూరిపేట సీఆర్ క్లబ్ చిలకలూరిపేట కళాపరిషత్తుల ఆధ్వర్యంలో స్థానిక సీఆర్ క్లబ్‌లో మూడు రోజులపాటు జరిగిన నాటిక పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ కళాకారులను, కళాభిమానుల్ని, మంచి పేరున్న నటీనటుల్ని ఒకచోటికి చేర్చి ప్రజలు మెచ్చేలా నాటికలు, కళా ప్రదర్శనలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఒకప్పుడు కళాప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో నిత్యం కళకళలాడిన చిలకలూరిపేటలో టౌన్ హాల్ వంటి కళాక్షేత్రాలను కూడా గత పాలకుల వైఖరితో కళావిహీనంగా మారాయన్నారు. పరిపాలన అంటే ఏమిటో తెలియని వారివల్ల ప్రజలే కాకుండా కళా నిలయాలు, కళాకారులతో పాటు ప్రజలు కూడా నానా అవస్థలు పడ్డారని అన్నారు. గత పాలకులు తమ స్వార్థప్రయోజనాల కోసం టౌన్‌హాల్‌ను మార్చేశారని, దాన్ని మరలా యథాస్థానంలో కొనసాగేలా చేస్తానని చెప్పారు. సీఆర్ క్లబ్ నిర్వాహకులు కళలు, నాటకాలను ప్రోత్సహించడమేగాక, కళాకారుల్ని గుర్తించి సన్మానించడం అభినందించాల్సిన విషయమన్నారు. కార్యక్రమంలో సీఆర్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చెరుకూరి కాంతయ్య, పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు, ముత్తవరపు సురేష్ బాబు, ఏవీ శివయ్య పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

ఉత్తమ ప్రదర్శనగా చీకటి పువ్వు

చిలకలూరిపేట సీఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్తుల ఆధ్వర్యంలో సీఆర్ క్లబ్‌లో మూడు రోజుల పాటు జరిగిన నాటిక పోటీలో కరీంనగర్ చైతన్య కళాభారతి వారి చీకటి పువ్వు నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ద్వితీయ, తృతీయ ఉత్తమ ప్రదర్శనలుగా గుంటూరు అమృతలహరి థియేటర్ ఆర్ట్స్ వారి నాన్నా నేను వచ్చేస్తా, గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిగురు మేఘం ఎంపికయ్యాయి. ఉత్తమ నటుడిగా కరీంనగర్ చైతన్య కళాభారతి వారి చీకటి పువ్వు నాటికలో వంశీ పాత్రధారి వి.సత్యనారాయణ, ఉత్తమ నటిగా అదే నాటికలో పవిత్ర పాత్రధారి లహరి ఎంపికయ్యారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జట్టి హరిబాబు, పమిడి గంటి సుమ, కేవీ మంగారావు వ్యవహరించారు. విజేతలకు నిర్వాహకులు, దాతలు బహుమతి ప్రదానం చేశారు.

బావులను పరిరక్షించరూ...

● బావులకు రక్షణ లేక అపరిశుభ్రంగా నీరు ● పూడిక లేక అడుగంటుతున్న జలం

వినుకొండ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం పెరగడంతో నీటి సమస్యతో మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. మండలంలోని ఉప్పరపాలెంలో వారసుల నుంచి సక్రమించిన చేతి బావులు పూడికలకు, మరమ్మతులకు నోచుకోకపోవడంతో జలం అడుగంటుతున్నాయి. దీంతో పరిశుభ్రత లేని నీటిని వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది.



చింతావారి బావి



మోటార్లతో నీటిని వినియోగిస్తున్న బొడ్రాయి బజారులోని బావి

పురాతన కాలం నుంచి నేటికి కొనసాగుతున్న బొడ్రాయి బజారులోని బావితో పాటు మేడబోయిన బావి, కాళింగ వారి బావి, చింత బాలయ్య బావి, లక్ష్మీరెడ్డి బావి, చిన్నవీరయ్య బావి, మున్సుబ్ బావి ఇలా చెప్పుకుంటూ పోతే ఆ గ్రామంలో బావులు అధికంగా ఉన్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా రక్షిత తాగునీరు ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటికీ కూడా కుటుంబ అవసరాల కోసం వారసత్వంగా వచ్చిన బావులను ఉమ్మడి కుటుంబాలు బావిపై ఉన్న హక్కును వినియోగించుకుంటూ విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని వినియోగించుకుంటున్నారు. బావిపై సరైన భద్రతా చర్యలు లేకపోవడం, బావిలో చెత్తాచెదారం నిండిపోవడంతో నీరు దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా స్థానిక అధికారులు బావులపై శ్రద్ధ చూపి ప్రజల అవసరాలను తీర్చేందుకు నీటిని శుద్ధిచేసి, బావులలో పూడికలు తీయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి వారసత్వంగా వస్తున్న బావుల మనుగడను కాపాడాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



రామాలయం వద్ద శిథిలావస్థకు చేరిన వారసత్వపు బావి



ఇనుప కొట్ల బజారులో డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలు

మురుగు కాల్వలపై యథేచ్ఛగా ఆక్రమణలు

● ప్రధాన వీధులలో కనిపించని కాల్వలు

చిలకలూరిపేట, మే19 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట పట్టణంలో ప్రధాన వీధులతో సహా పలు వీధుల్లో మురుగు కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయి. పలుచోట్ల కాలువలు ఉన్న దాఖలాలే కనిపించడం లేదు. కాల్వలపై చిన్న చిన్న దుకాణాలు, వ్యాపార సామాగ్రి, మెట్లు, ర్యాంపులు కనిపిస్తున్నాయి. డ్రెయిన్లపై ఆక్రమణలతో పారిశుధ్య సిబ్బంది కాల్వలను శుభ్రం చేయలేని పరిస్థితి నెలకొంది. కాల్వల్లో టన్నుల కొద్దీ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆక్రమణల కారణంగా కాల్వల్లో పూడిక తీయలేని పరిస్థితితో చిన్నపాటి వర్షానికే సుబ్బయ్యతోట, ఇనుపకొట్ల బజార్, కళామందిర్ సెంటర్, ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ తదితర ప్రాంతాల్లో మోకాలు లోతున మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. ఇటీవల మున్సిపాలిటీ వారు కాలువలను హద్దుగా చేసుకొని ఆక్రమణలు తొలగించినప్పటికీ పర్యవేక్షణ లేని కారణంగా తిరిగి డ్రెయిన్లపై ఆక్రమణలతో యథాతథ స్థితికి చేరాయి. ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చిలకలూరిపేటలో డ్రెయిన్లను ఆక్రమించి నిలిపి ఉంచిన కార్లు



పెరుమాళ్లపల్లి మేజర్‌పై రెయిలింగ్ లేని బ్రిడ్జి

ప్రమాదకరంగా పెరుమాళ్లపల్లి కాలువ వంతెన

● కోతకు గురైన కాలువ కట్ట ● ధ్వంసమైన రెయిలింగ్

ఈపూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపల్లి మేజర్ కాలువపై అగ్నిగుండాల సమీపంలో ఏర్పాటుచేసిన వంతెన ప్రమాదకరంగా ఉంది. అగ్నిగుండాల నుంచి ఊడిజర్ల వెళ్లేందుకు ఏర్పాటుచేసిన తారురోడ్డు ఉన్న కాలుపై బ్రిడ్జిని నిర్మించారు. ప్రస్తుతం బ్రిడ్జికి రెండు వైపులా ఏర్పాటుచేసిన కాలువ కట్ట కోతకు గురై, రెయిలింగ్ దెబ్బతింది. ఈ బ్రిడ్జిపై వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్త శుద్ధీకరణ ప్లాంటును మున్సిపల్ చైర్మన్ రఫానీతో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

డంపింగ్ యార్డును సుందరీకరిస్తాం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు లక్షల టన్నుల చెత్తను వేరేచోటికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం అన్నారు. ఇందుకోసం టన్నుకు రూ.750 చొప్పున రూ.13 నుంచి రూ.15 కోట్లు ఖర్చుచేస్తున్నామని చెప్పారు. పట్టణ సమీపంలోని మానుకొండవారిపాలెం వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. అనంతరం చెత్త శుద్ధీకరణ ప్లాంటును మున్సిపల్ చైర్మన్ రఫానీతో కలిసి ప్రారంభించారు.



వెంకటేశ్వర్లుకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి సాంబశివరావు

ముండ్రువారిపాలెం ఉపసర్పంచ్‌గా వెంకటేశ్వర్లు

ముండ్రువారిపాలెం (శావల్యాపురం) మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావు వ్యవహరించారు. మొత్తం 10మంది వార్డుసభ్యులకు గాను 9మంది ఎన్నికకు హాజరయ్యారు. 9మంది వార్డుసభ్యులు ఏకగ్రీవంగా 4వ వార్డు సభ్యుడు పాపసాని వెంకటేశ్వర్లును ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వెంకటేశ్వర్లుకు ఎన్నికల అధికారి సాంబశివరావు నియామకపత్రాన్ని అందజేశారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వెంకటేశ్వర్లును గ్రామ టీడీపీ నాయకులు సత్కరించారు.



కొత్త జెడ్డావారిపాలెం ఉప సర్పంచ్ పీ ప్రసాదరావుకు నియామక పత్రంను అందజేస్తున్న ఎన్నికల అధికారి షేక్ అల్లాభక్షు

నూజెండ్ల మండలంలో....

నూజెండ్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త జెడ్డావారిపాలెం, పాత జెడ్డావారిపాలెం పంచాయతీల ఉపసర్పంచ్‌ల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కొత్త జెడ్డావారిపాలెం ఉప సర్పంచ్‌గా 2వ వార్డు సభ్యుడైన పీ ప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా పాత జెడ్డావారిపాలెం ఉప సర్పంచ్‌గా 4వ వార్డు మెంబరు బీ నాగేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా ఎస్‌కే అల్లాభక్షు, బీ యలమంద బాధ్యతలు నిర్వహించారు.

రేషన్‌షాపును మహిళా గ్రూపునకు కేటాయించాలి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ

యడ్లపాడు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సందెపూడిలోని రేషన్ షాపు నం.28కి సంబంధించిన డీలరు షిప్ ఖాళీగా ఉందని, అది తమకు కేటాయించాలని గ్రామానికి చెందిన వెంకటేశ్వర మహిళా గ్రూపు అధ్యక్షురాలు నాగరాజు ఆషా కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ విజయశ్రీకి అర్జీ అందజేశారు. గత పది నెలలుగా డీలరు నియామకం జరపకపోవడంతో వీఆర్‌ఏ అథంటికేషన్‌తో ఎండీయూ ఆపరేటర్లు రేషన్ పంపిణీ చేస్తున్నారన్నారు. వీఆర్‌ఏ విధి నిర్వహణలో భాగంగా ఎండీయూ ఆపరేటర్లకు తరచూ అందుబాటులో ఉండకపోవడంతో రేషన్ సరుకుల పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంటోందన్నారు. అంతేగాకుండా ప్రభుత్వం జూన్ నెల నుంచి ఎండీయూ ఆపరేటర్ల స్థానంలో సరుకుల పంపిణీని డీలర్ల ద్వారానే చేయాలని నిర్ణయించినందున సదరు షాపును తమ మహిళా సంఘానికి కేటాయించాలని అర్జీలో కోరారు.

కొచ్చెర్లలో ఘనంగా శిడిమానోత్సం

ఈపూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల గ్రామంలో సోమవారం రాత్రి శిడిమానోత్సవం ఘనంగా జరిగింది. అంకాళపరమేశ్వరి కొలుపులు ముగింపు సందర్భంగా గ్రామస్థులు శిడిబండిని అందంగా అలంకరించి మొక్కుబడి ఉన్నవారు తమ ఉత్పత్తులను బండిపై ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు. ఉత్సవం సందర్భంగా ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



శిడి బండితో గ్రామస్థులు